మని ఎంతమాట పడితే అంతమాట అంటా వేమిటి?" అన్నాడు.

చిదంబరానికి యింతకాలం నుంచీ హృదయంలో పేరుకుపోయివున్న క్రోధం బయటకు చిమ్మింది. "అవును. దొంగపని చేశాడు కాబట్టి అడిగాను. వున్నమాట అనటానికి దడవ నవసరం లేదు" అన్నాడు.

"అయితే మీయింట్లో గతిలేక వుంటున్నా మనుకుంటున్నావా?"

"ఆ మాట నేననలేదు. అయినా ఎందుకు కాకూడదు?"

సోమసుందరంగారికి వళ్లు మండింది. "ఏమయ్యోయ్. మాటలు తిన్నగా రానీ. నా కూతుర్ని నీ అందం చూసి యిచ్చా ననుకుంటున్నావా? నేనింక ఒక్క క్షణం యీ యింట్లో వుండను" అని అరిచాడు.

"ఆ మాటే నేనూ అంటున్నాను. ఇంతవరకూ వచ్చిం తర్వాత నిన్నింక యీ యింట్లో వుండనిస్తా ననుకుంటున్నావు కాబోలు" అన్నాడు చిదంబరం కోపంగా.

"అంతపని అవసరం లేదులే. ఎరక్కపోయి నా కూతుర్నిచ్చాను. నువ్వు లేకపోతే బ్రతకలేకపోంలే. నా కూతుర్ని కూడా యిక్కడ వుంచను."

చిదంబరం ఒక్కసారి వులిక్కి పడ్డాడు. తనెందుకు పెళ్ళి చేసుకున్నాడు? నలుగురితో వేగలేక శాంతికోసం. ఆ శాంతి లభ్యమవనందుకు వీళ్ళంతా ఎందుకు? ఆవిడ లేకపోతే తను బ్రతకలేడా? అదివరకెలా బ్రతికాడు?

"నీ యిష్టం. నువ్వేం చేసుకున్నా నాకిష్టమే. తీసుకుపో"

తను ప్రయోగించిన అస్త్రం వుపయోగపడనిసరికి హతాశుడయి కోపాన్ని చంపుకోలేక అరిచాడు, "ఒసే అమ్మాయి. పద్దసెయ్యి. ఈ పాడు కొంపలో ఒక్క క్షణం వుండొద్దు"

వచ్చిన వాళ్లంతా వెళ్ళిపోతుంటే చిదంబరం చలించలేదు. అంతా వెళ్లిపోగానే తలుపు భధాలున వేసుకుని అమ్మయ్య అనుకున్నాడు. జరుగుతున్నదంతా కిటికీలోంచి చూస్తున్న సుందరం యీ విషయాన్ని బలరామయ్యతో చెప్పటానికి పరిగెత్తుకు పోయాడు.

చిదంబరం మనస్సు యిప్పుడెంతో తేలికపడింది. తన కిష్టం లేకుండా తెచ్చుకున్న భార్య తన మీద నేరం లేకుండానే వచ్చిన దారిన వెళ్ళిపోయింది. యిక వూళ్లో తనను చూచి పళ్లు కొరుక్కోరు. చిదంబరం ఒకటి నిశ్చయించుకున్నాడు. మళ్లీ ఏ కారణం చేతనయినా భార్య తిరిగొస్తే ఆమెను మళ్ళీ స్వీకరించ కూడదు. తన జీవితం ఒంటరిగానే అంతమయిపోవాలి.

మరునాటి వుదయం బలరామయ్యగారు చిదంబరం యింటికి వచ్చి "చిదంబరంగారూ!" అని కేకేశాడు.

---

కథానిక

# సదానందుడి మహిమ

## పి. రామచంద్రరావు

రామసుబ్బయ్యగారు ఆ వూళ్ళోకల్లా ధనవంతులు. చక్కని మేడ, చుట్టూ పూలతోట ఎంతో మనోహరంగా వుంటుంది. దొడ్డి నిండా పశువులు, పదిమంది పాలేళ్లుకలిగి పాడి పంటలుసమృద్ధిగావున్నాయి. ఊళ్ళోకల్లామంచి భూములన్నీ ఆయనవే. ఆయనమాటకు యెదురాడే వ్యక్తేలేదు. నయానా, భయానా వూళ్లో జనమంతా ఆయన చెప్పు చేతల్లో వుండేవారు. ఆపద వచ్చినప్పుడు ఎక్కువవడ్డీ తీసుకొన్నా—పెట్టుబడి పెడుతూండేవారు. ఈ విషయంలో రామసుబ్బయ్యగారికి దూరదృష్టి లేకపోలేదు. అప్పుతీసుకొన్న విశ్వాసం పూరికేపోదు. వడ్డీకి వడ్డీ వస్తుంది. అవసరమయినప్పుడు ఆ పలుకుబడితో పనులన్నీ నెరవేర్చుకోవచ్చు. అంతా ఆయన పరోపకారాన్ని శ్లాఘించుతూ వుంటారు.

ఇంత సంపద కలిగివున్నా రామసుబ్బయ్య గారిని ఒక విచారంపట్టి పీడించుతూవుంది తన తరువాత యీ ఆస్తి కంతకూ కర్త ఎవరా! అనే దిగులు. ఆయనకు సంతానం లేదు. సంతానంలేని విచారం ఆయన్ను క్రుంగదీస్తోంది. సంతానంలేని గృహం శూన్యం. దారిద్ర్యాన్ని అనుభవించుతున్నా నలుగురు పిల్లాజెల్లా కలిగిన కుటుంబాలు కళకళలాడుతూవుంటాయి. పూర్వ జన్మలో తానేదో పాపం జేసినందువల్లనే యీ జన్మలోభగవంతుడుతనకీశిక్షవిధించాడనిభావించే వారు. దాని పరిహారార్థం, నిత్యమూ రెండు పూటలూ పూజలు మొదలుపెట్టారు. పురాణ కాలక్షేపం, హరికథలూ, సంతర్పణలూ, దేవతా వుత్సవాలూ, తరచుగా జరిగిపోతున్నాయి. గోదానం, భూదానం, ఇంకా ఇంకా యితర దానాలన్నీ జేస్తున్నారు. వారి భార్య సీతమ్మ గారుకూడా యీ విషయంలో భర్త ననుసరించి తన పతిభక్తినీ, దైవభక్తినీ నిరూపించుకొన్నది. భార్యాభర్త లిద్దరూ తాము కట్టించిన రామాలయంలో, పీటలమీద కూర్చొని శ్రీరాముని కల్యాణమహోత్సవాన్ని జరిపించే వారు. నెల నెలా సత్యనారాయణ వ్రతం జరపబడేది. అప్పుడు పురోహితుడు చెప్పే సత్యనారాయణస్వామి మహత్తును విని ప్రేక్షకులతోపాటు తామూ మైమరచి పోయేవారు. సత్యనారాయణస్వామి వ్రతంవల్ల సముద్రంలో మునిగిపోయిన పడవలు తేలడం, సంతానం కలగడం, చనిపోయిన బిడ్డలు అప్పటికప్పుడు బ్రతకడం, వగైరా కథలన్నీ వారి ఆశలను రేకెత్తించేవి. జనమంతా రామసుబ్బయ్యగారి భక్తిని వేనోళ్ళ కొనియాడుతున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాలన్నిటిలో వారికీర్తి వ్యాపించి పోయింది.

ఒకనాటి విషయం అప్పుడే తెల్లవారుతోంది. ఊళ్ళో జనమంతా పనులకు వెళ్తున్నారు. అందులో ఒకాయన గ్రామాన్నానుకొనివున్న రామసుబ్బయ్యగారి తోటలో ఒక ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూశాడు. ఎవరో అపరిచితుడైన వ్యక్తి, కాషాయవస్త్రాలు ధరించి, పొడుగాటి గడ్డమూ, పంగనామాలూ, మెడలో నామాలదండా, చేతిలో కమండలం, ప్రక్కన జింకచర్మమూ కలిగి, ధ్యానములో లీనమైవున్నాడు. ఆ దృశ్యాన్ని చూడగానే భయముకలిగి, పరుగెత్తుకుంటూ వచ్చి రామసుబ్బయ్యగారితో విషయమంతా చెప్పేశాడు. ఊరంతా యీ వార్త ప్రాకిపోయింది. ఎవరో మహాయోగి తమ నుద్ధరించడానికే వచ్చాడనుకొని రామసుబ్బయ్యగారూ, సీతమ్మగారూ, మంగళహారతులూ కానుకలూ తీసుకొని మంగళవాయిద్యాలతో తోటకు బయలుదేరారు. ఊళ్లో జనమంతా వారి ననుసరించింది. అంతా తోటకు చేరుకొన్నారు.

ధ్యాననిమగ్నుడైవున్న యోగీశ్వరుణ్ణి సమీపించి "దేవా! తమరెవరో, ఎక్కడనుంచి విచ్చేశారో, యీ దీనుడు చేయగల్గిన సేవ ఏదైనా వుంటే సెలవియ్యండి" అని చేతులు జోడించి ప్రార్థించారు రామసుబ్బయ్యగారు. అప్పుడు నేత్రాలు విప్పి జనమువంక పరికించి చూచి ఆ యోగిపుంగవుడు "నాపేరు సదానంద స్వాములవారు. నాకు ఒక వూరూ, ఒక ప్రదేశమంటూ నిర్ణయం లేదు. భగవంతుని ఆజ్ఞప్రకారం, ఆయన పూజలో నిమగ్నమైయుండి, యీ లోకంలో భగవంతుని భక్తులు పొందే బాధల నివారణకోసమే యిలా సంచారము చేస్తూవుంటాను. దివ్యదృష్టివలన, యీ గ్రామంలో భగవంతుని సేవకుడొకడు బాధపడుతున్నాడని గ్రహించి యిక్కడకు విచ్చేశాను" అని చెప్పితిరిగి నేత్రాలనుమూసుకొని ధ్యాననిమగ్నుడయ్యాడు. అప్పుడు రామసుబ్బయ్యగారు సంతోషభరితులై పోయారు. "మహాపురుషా! నేడు తమ దయవలన అనుగ్రహింప



బద్ధాను. తమరిక్కడే నివాసమేర్పరచుకొని నిత్యమూ యీ దీనుణ్ణి కరుణించుతూ వుండండి. తమ సేవ కేవిధమైన లోటు రాకుండా చూస్తాను" అని తమ కోర్కెను వెల్లడించాడు. భక్తుల కోర్కెకు అన్యధా జరగబోదని యోగీశ్వరుని నుండి హామీని పొంది తెచ్చిన కానుకలు సమర్పించి, మహాసంతోషంతో యింటికి చేరుకొన్నారు.

ఆనాటినుంచీ, రామసుబ్బయ్యగారు రోజూ వుదయమూ, సాయంత్రమూ, సపత్నీకుడై, తోటకు వెళ్ళి సదానంద స్వాములవారిని పూజించి వచ్చేవారు. వారి పాదామృతాన్ని శిరోధారణ చేసుకొనేవారు. స్వాములవారి నివాసానికి ఒక మఠమూ, పూజా మందిరమూ, నిర్మించబడ్డాయి. పాలూ, పండ్లూ వగైరా పదార్థాలకు లోటులేకుండా స్వాములవారి అవసరాలన్నీ తీరుస్తున్నారు. స్వాములవారు సదా ధ్యానములో నిమగ్నులై చూసేజనానికి ఆశ్చర్యాన్ని గొలుపుతుంటారు. నిత్యమూ సంతర్పణలో, వుత్సవాలో జరుగుతూవుండేవి. రామసుబ్బయ్యగారూ, సీతమ్మగారూ, వూర్లో ఇంకా కొంత మందీ, స్వాములవారికి శిష్యబృందమయారు.

ఇలా కొంతకాలం గడిచిపోయింది. ఒకనాడు రామసుబ్బయ్యగారి మేడలో మూడు నాగుపాములు ప్రత్యక్షమయ్యాయి. చుట్టుప్రక్కల జనమంతా గుమిగూడారు. అందరికీ యిదంతా మాయగా కనబడింది. అంతా "ఆ భగవంతుని జగన్నాటకం" అనుకొన్నారు. చుట్టూ గుమిగూడివున్న జనాన్ని చూచికూడా పాములు బుసగొట్టి పైకి రాకుండా వుండడం చూస్తే జనానికి యింకా ఆశ్చర్యం వేసింది. ఇదంతా ఆ భగవంతుని మాయతప్పితే మరేమీ కాదని తేల్చేశారు కొందరు. భక్తులను పరీక్షించడానికి భగవంతుడు యిలాగే చేస్తుంటాడని యింకొకరన్నారు. జనంలోనుంచి భగవంతుని లీలలు అర్థంకాని ఒక మూర్ఖుడు "ఈ పాములకు నడుములు విరిగినట్లుందే" అన్నాడు. ఇంతలో యింకొకాయన "అసలు వీటికి పండ్లుకూడా లేవనుకొంటాను" అని అందుకున్నాడు. జనంలోనుంచి వెంటనే ఒక భక్తుడు ముందుకువచ్చి "రామరామ! భగవంతుని మాయలను శంకించగలమా? ఇలాంటి మాటలతో దేవునికి కోపం తెప్పిస్తే యింకా మన గతి ఏమన్నా వుందా?" అని బిగ్గరగా అరిచాడు. జనమంతా అవునన్నారు.

ఇక్కడ యిలా జరుగుతుండగా, సదానంద స్వాముల వారికి కబురు వెళ్ళింది. స్వాముల వారు సమాధినుండి లేచివచ్చారు. అక్కడ చుట్టూవున్న జనాన్ని వుద్దేశించి "ఇదంతా ఆ భగవంతుని కృపా విశేషం. ఇవ్వాళ కుభగవంతునికి దయకలిగింది. దానికి గుర్తుగానే పాములను పంపించాడు. ఇది సంతానానికి శుభలక్షణం. ముగ్గురు సుపుత్రులు జన్మించుతారు. కాని దీనికి యింకా నిర్వహించవలసిన కార్యాలున్నాయి" అని పలికారు. ఏమి చేయాలో వివరించమని జనమంతా కోరారు. ఈ మేడలోనే ఒక పూజా మండపాన్ని ఏర్పరచి రోజూ వుదయం భార్యా భర్తలిద్దరూ, సాయంకాలం ఒక్క భార్య మాత్రమే పూజలు జరపాలి. సాయంత్రం సీతమ్మగారిచేత 'సంతాన ప్రాప్తి' వ్రతం చేయించాలి. ఈ విధంగా ఒక పక్షంరోజులు జరిపితే భగవంతుని అనుగ్రహం ప్రకారం సంతానం కలుగుతుంద"ని చెప్పి స్వాములవారు ఆ పాములను పట్టుకొని తోటకు తిరిగి వెళ్ళిపోయారు. ఈ దృశ్యాన్ని చూచిన జనమంతా స్వాములవారి మహిమకు ఆశ్చర్య పడ్డారు.

రామసుబ్బయ్యగారి హృదయంలో చెప్పరాని సంతోషం కలిగింది. సీతమ్మగారికి అంతకంటె తక్కువ సంతోషం కలుగలేదు. భార్యా భర్తలిద్దరూ, సంతానవాంఛ తీరుతుందనే సంతోషంతో నిండిపోయారు. మరునటి రోజు నుంచే సదానంద స్వాములవారి ఆజ్ఞ ప్రకారం పూజా వ్రతాలు మొదలు పెట్టారు. అట్టహాసంగా జరిగిపోతున్నాయి. రామసుబ్బయ్యగారూ, ఆయనతోపాటు వూళ్ళో జనమంతా సంతోషాన్ని పట్టలేకపోతున్నారు.

పదహారో రోజు తెల్లవారే సరికల్లా వూరంతా గల్లంతుగావుంది. సదానందస్వాముల వారు, సీతమ్మగారితో సహా ఆ రాత్రే అంతర్ధానమయ్యారు. ఇనప భోషాణంలో వున్న యిరవైవేల రూపాయలూ, బంగారమూ కూడా మాయమయి పోయినవి.